క్లుప్తంగా

కృష్ణాష్టమి పూజలు



వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారు

బలిజిపేట: గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త కంచర్ల రాంబాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పారాయణ చేసి భజనలు చేశారు. ఉట్టికొట్టే సంబరం నిర్వహించారు. స్వామివారిని తిరువీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గంగాడలో శ్రీకృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.సూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



లక్ష్మీనృసింహ స్వామికి పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువైన లక్ష్మీనృసింహ ఆలయంలో ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామిని వివిధ రకాల పూలు, పత్రాలతో ప్రత్యేకంగా అలకంరించారు. అలంకరణ అనంతరం మేరకు ఉదయం 6 గంటలకే ఆలయానికి పూజా సామగ్రితో చేరుకున్న భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే కృష్ణజన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, కృష్ణభగవానుడి లీలలపై కథానిక వినిపించారు.

పెద్దంకలాంలో ఉద్ధృతంగా నీటి ప్రవాహం



పెదంకలాం డ్యాం వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నీరు

సీతానగరం: మండలకేంద్రానికి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురవడంవల్ల గురువారం ఉదయం నుంచే సువర్ణముఖి నదిపై ఉన్న పెదంకలాం డ్యాం(ప్రాజెక్ట్) మీదుగా వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నదిపై ఉన్న డ్యాం మీదుగా నీరు నిల్వ ఉన్నందున నిరంతరం ప్రజలు తిరుగాడే బూర్జ రేవు నీరుతో ముంపునకు గురవడం వల్ల ప్రమాదం పొంచిఉంది. అలాగే వరిచేను పొలాలు నీటమునిగాయి. ఈ మేరకు తహసీల్దార్ ఎన్వీ రమణ వద్ద ప్రస్తావించగా నదిలో నీరు ఎక్కువగా ప్రవహించడంతో నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు నీటి ప్రవాహాన్ని పరిశీలించి నదిలోంచి ప్రయాణం చేయాలని వీఆర్వోల ద్వారా ప్రజలకు తెలియజేశామన్నారు.

12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

సీతంపేట: ఈ నెల 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌కు ఎంపికలు జరగనున్నాయని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అన్ని పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి పంపించాలన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి గేమ్స్ జరగాల్సి ఉన్నప్పటికీ వర్షాలు కురుస్తున్న కారణంగా తాత్కాలికంగా వాయిదా పడ్డాయని తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటీఐలో మిగులు సీట్లు భర్తీ చేపట్టేందుకు ఈ నెల 22న నాల్గో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం తమ శిక్షణ కేంద్రంలో డ్రస్ మేకింగ్ ట్రేడ్‌లో 39 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు సమర్పించడంతో పాటు ఈ నెల 20వ తేదీన తమ ఐటీఐకు వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే కౌన్సెలింగ్‌కు విద్యార్హత ధ్రువపత్రాలన్నీ ఒరిజినల్‌ను వెంట తీసుకురావాలని కోరారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

- పరిస్థితులు చక్కదిద్దేందుకు కృషి
- కదిలిన అధికార యంత్రాంగం
- బాధితులకు ఆహారం, మంచినీరు, ఆర్థిక సహాయం అందించేందుకు ఏర్పాట్లు



రైతు బజారు వద్ద పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ ప్రాంతంలో బుధవారం సాయంత్రం కేవలం 2గంటల వ్యవధిలో కురిసిన 8.4 సెంటీమీటర్ల అధిక వర్షపాతంతో ఒక్కసారిగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. ఈ మేరకు ముంపు ప్రాంతాలలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు చైతన్య పాఠశాల పరిసరాలు, 20వ వార్డు జనశక్తి కాలనీ, సుందర నారాయణపురం కాలనీలు, సౌందర్య రోడ్డు ప్రాంతం, నెల్లిచెరువు గట్టు, బైపాస్ కాలనీ ప్రాంతాలను సందర్శించారు. మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో పాటు పర్యటించి యుద్ధ ప్రాతిపదికన వరహాల గెడ్డ వరదనీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగింపచేయడంతో పాటు, జేసీబీ సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ముంపు కాలనీలలో ఇళ్లు నీటమునిగిన బాధిత ప్రజలకు తన సొంత ఖర్చులతో మంచినీరు, భోజనం ఏర్పాటు చేయించారు. స్థానిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చోట ప్రభుత్వం తరపున సహాయక చర్యలు అందేలా చర్యలు చేపట్టారు.

- 20– 21 వార్డుల పరిధిలో గల చర్చి సెంటర్ నుంచి జనశక్తి కాలనీ వరకు ఉన్న రోడ్డు పునర్నిర్మాణం కోసం ఇప్పటికే బుడా సంస్థ నుంచి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించి త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తామని వార్డుల ప్రజలకు హామీ ఇచ్చారు.
- జనశక్తి కాలనీ, సుందర నారాయణపురం కాలనీల మీదుగా ప్రవహిస్తున్న వరహాల గెడ్డపై ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన నిధులను త్వరలో మంజూరు చేయించి నిర్మాణం చేపడతామని భరోసా ఇచ్చారు.
- వరహాల గెడ్డల ఉధృతి ప్రవాహానికి నీటమునిగిన నెల్లి చెరువు గట్టు ప్రాంత ప్రజలకు అవసరమైన అత్యవసర సహాయం చేసేందుకు అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.. అలాగే వరదనీరు దారి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.
- యుద్ధ ప్రాతిపదికన బైపాస్ కాలనీలో అత్యవసర చర్యలు చేపట్టిన మూలంగా కాలనీలో వరదనీరు తొలగి, గెడ్డ వరద నీరు సాఫీగా సాగిపోతుండడంతో, వరద సమస్య నుంచి బయటపడిన బైపాస్ కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సాధారణ స్థితికి పరిస్థితులు

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటనతో పార్వతీపురం ముంపు ప్రాంతాల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు శ్రమిస్తున్న పురపాలక సిబ్బంది, దగ్గర ఉండి సహాయక చర్యల్లో పాల్గొన్న మున్సిపల్ అధికారులు, వారికి దిశానిర్దేశం చేస్తూ పరిస్థితులు సాధారణ స్థితికి తెచ్చేందుకు కృషి చేశారు. ఒక్క మెసేజ్‌తో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అత్యవసరంగా విచ్చేసి తమ ప్రాంతాలను సందర్శించి సహాయక చర్యలు చేయించడమే కాకుండా తమకు అండగా నిలిచి భరోసా కల్పించినందున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఆయా వార్డుల ప్రజలు తెలిపారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



వర్షపు నీటి మళ్లింపు చర్యలు చేపడుతున్న మున్సిపల్ అధికారులు



మోటార్ల సహాయంతో వర్షపు నీరు మళ్లిస్తున్న సిబ్బంది

ఆహ్వానం



ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు ఆహ్వానం పలుకుతున్న డీసీసీబీ అధికారులు, చైర్మన్లు

సాలూరు: మెంటాడ మండలం చల్లపేట గ్రామంలో డీసీసీబీ బ్రాంచ్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపనకు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొరకు డీసీసీబీ అధికారులు ఆహ్వానం పలికారు. పట్టణంలోని డిప్యూటీ సీఎం స్వగృహంలో ఆయన్ను గురువారం కలిసి ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ జనార్దన్, మెంటాడ, జక్కువ పీఏసీఎస్ చైర్మన్లు తాడ్డి రామచంద్రరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో పొలం బడి



వైఎస్ఆర్ పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ ఎస్. అవినాష్

సీతానగరం: మండలంలో వరిచేను పంటలపై వచ్చే తెగులు నివారణకు వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఏఓ ఎస్ అవినాష్ సూచించారు. గురువారం ఈమేరకు కె వెంకటాపురంలో ఆయన ఆధ్వర్యంలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వరిచేలపై ఆశించే తెగులు పట్ల, తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు.

ఆకుల కత్తిరింపు

వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా కామందొరవలసలో పొలంబడి ప్రయోగాత్మక మడిలో పిలకల కత్తిరింపు, ఆకుల తొలగింపు ప్రయోగం చేశారు.

'పక్షి స్థావరాల ఏర్పాటు

ప్రయోగాత్మక మడిలో పక్షి స్థావరాలను పెట్టామని, వాటి వల్ల పొలంలో పక్షులు వాలి శత్రు పురుగులను, వాటి లార్వాలను తినడం వల్ల పొలంలో వాటి ఉధృతి తగ్గి పంటదిగుబడికి దోహదపడుతుందన్నారు. సాధారణంగా పక్షి స్థావరాలను పంట స్థితిని బట్టి పైరుకు ఒక అడుగు ఎత్తులో ఉండేటట్లు చూసుకోవాల్సి ఉందని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, పొలంబడి రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీరమణ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలనుంచి నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌సెల్‌ను ప్రజలు వినియోగించు కోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్, ప్రసాద్, తహసీల్దార్ ఎన్వీ రమణ, ఏఓ ఎస్.అవినాష్ కోరారు. ఈ మేరకు గురువారం వారు మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతవరకూ జిల్లా కేంద్రంలోనే జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించేవారని ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా ఉండాలనే సంకల్పంతో మండల కేంద్రాల్లో గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయడం వల్ల ఏర్పాట్లను పరిశీలించామని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి జరగనున్న కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకట రావు, ఆర్డీవో కె. హేమలత, ఇతరశాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొంటారని తెలియ జేశారు.

నూతన మోడరన్ మార్కెట్ యార్డు సందర్శన



నిర్మాణంలో ఉన్న మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో నూతన మోడరన్ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతనమైన మార్కెట్ యార్డు ఇది అని, ఎటువంటి వర్షం వచ్చినా, ఎండకురిసినా మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలను సాగించే స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకావు. సవ్యంగా, సాఫీగా కూరగాయల మార్కెట్‌లో క్రయ విక్రయాలు సాగేలా మంచి మార్కెట్ యార్డ్‌ను నిర్మించడమే కాకుండా దానిని మరింత మెరుగుపరిచి అధునాతనంగా తీర్చిదిద్దేందుకు కృషిచేశామని చెప్పారు.

కార్యక్రమంలో సర్పంచ్ సవరాపు రాజారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ వెంపలి గురు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు

- డీఐఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని డీఐఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రంలో ఆయన కూరగాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న జీవన విధానంలో మనం తీసుకున్న ఆహారం ఆరోగ్యంపట్ల ప్రభావితం చూపిస్తుందన్నారు. రసాయన ఎరువుల వాడకం అధికంగా ఉన్న ఆహార ఉత్పత్తులను ఎక్కువగా తీసుకోవడం వల్ల మానవాళి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. దీర్ఘకాలికంగా ఇటువంటి ఆహారం తీసుకోవడం వల్ల రసాయనాలు శరీరంలోని ముఖ్యమైన అవయవాలను దెబ్బతీస్తున్నాయని చెప్పారు. అదే ప్రకృతి వ్యవసాయ విధానంలో సేంద్రియ ఎరువుల వినియోగంతో పండే ఉత్పత్తుల్లో ఎటువంటి హానికర రసాయనాలు ఉండవని ఆ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని హితవు పలికారు. కార్యక్రమంలో వై.యోగీశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలి

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణ, మండల అంగన్వాడీ సిబ్బందికి డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య శ్రేయస్సుకు ఐసీడీఎస్, వైద్యశాఖల సిబ్బంది సమష్టి కృషి అవసరమని పిల్లల ఆరోగ్యానికి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నిసేవలు పూర్తిస్థాయిలో అందజేయాలని సూచించారు. పిల్లల్లో రక్తహీనత నివారించడం చాలా ఆవశ్యకమని వారికి రెండు సార్లు ఐరన్ వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ క్రెడిట్ పథకంలో రైతులకు రుణాలు

సీతానగరం: పశుసంవర్ధక శాఖ సీతానగరం సబ్‌డివిజన్ పరిధిలో ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ పథకం ద్వారా పాడి రైతులు, కోళ్లఫాంలు ఉన్న వారికి ముడిసరుకుల కొనుగోలుకు బ్యాంక్‌ల నుంచి రుణాలు సమకూర్చడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ శాఖ ఏడీఏ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రభుత్వం బ్యాంక్‌ల అధికారులతో చర్చించి పీఎం కిసాన్ క్రెడిట్ పథకం ద్వారా రుణసదుపాయం కల్పిస్తోందని చెప్పారు. ఈ మేరకు సీతానగరం మండలంలో 214 మంది, బలిజిపేట మండలంలోని 201 మంది రైతులనుంచి వచ్చిన అర్జీలను రెండు మండలాల బ్యాంక్ అధికారులకు సమర్పించామని, బ్యాంక్ యాజమాన్యాలు, ప్రభుత్వం నుంచి మంజూరు పత్రాలు రావలసి ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ నాయకుడిపై ఫిర్యాదు



ఎస్సైకు ఫిర్యాదు ప్రతిని అందజేస్తున్న ఎంపీపీ బి.ప్రమీల, గిరిజన సర్పంచ్‌లు

పాచిపెంట: తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్‌పై గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎంపీపీ బి.ప్రమీల, పలువురు గిరిజన సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరపై దారునాయక్ ఇటీవల నిరాధారణమైన అవినీతి ఆరోపణలు చేయడమే కాకుండా, గిరిజన ఉప కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా మాట్లాడారని ఎంపీపీ ప్రమీల అన్నారు. వెంటనే అటువంటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డీవీఈఓ మంజులా వీణకు అభినందనలు



డీవీఈఓ మంజులా వీణను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది



డీవీఈఓను సత్కరించిన జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు

పార్వతీపురంటౌన్: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా అవార్డు అందుకున్న పార్వతీపురం మన్యం జిల్లా డీవీఈఓ మంజులావీణను పార్వతీపురం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు, సిబ్బంది గురువారం అభినందించారు. ఉత్తమ అధ్యాపకురాలిగా డీవీఈఓ రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తెర్లి రవికుమార్, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, వెంకటేశ్వరరావు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. అలాగే డీవీఈఓ మంజులా వీణను ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు తెర్లి రవికుమార్ ఆధ్వర్యంలో అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆకుల రాజు, ఎస్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 3, 5 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పాలకొండ: నగర పంచాయతీలోని 3, 5 వార్డుల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. గురువారం జరగాల్సిన కార్యక్రమం వర్షం కారణంగా రద్దు చేశామని తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి అన్ని శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అర్హులందరికీ పింఛన్లు అందజేస్తాం..

- ఎమ్మెల్యే కళావతి



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్లు అందజేస్తామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ క్యాంపు కార్యాలయంలో ఇటీవల కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు గురువారం అందజేశారు. అర్హతే కొలమానంగా సీఎం జగన్మోహన్ రెడ్డి సుపరిపాలన చేస్తున్నారన్నారు. ఒకప్పుడు టీడీపీ హయాంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా వృద్ధులు, మహిళలు తిరిగేవారని, నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హత ఉన్నవారందకి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఉట్టి కొట్టే పోటీలు

భామిని: మండలంలోని పసుకుడిలో వెలసిన శ్రీకృష్ణుని మందిరం వద్ద ఉట్టి కొట్టే పోటీలు గురువారం సందడిగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పోటీలు నిర్వహించారు. సర్పంచ్ బెవరా భార్గవనాయుడు ఆధ్వర్యంలో యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం హరేరామ సంకీర్తన బృంద సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లివిరిలో...

భామిని: మండలంలోని లివిరిలో వెలసిన శ్రీగోపీనాథ రాధాకృష్ణ మందిరంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. గోపాలకులు సామూహికంగా పూజలు నిర్వహించారు. చిన్ని కృష్ణుడును ఊయలలో వేసి సంబరాన్ని సందడిగా అర్ధరాత్రి నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ముందుగా భక్తులు పాలు, పాల పదార్థాలను నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్కళ సాంప్రదాయం ప్రకారం అష్టమి వేడుకలను మిగులులో నిర్వహించడం ఆనవాయితీ. మండలంలోని పాతఘనసరలో వెలసిన అభయ కోదండ రామాలయంలోనూ కృష్ణాష్టమి పూజలు నిర్వహించారు. బాలేరు.పెద్దదిమిలిలలోనూ వేడుకలు నిర్వహించారు.



భామిని: లివిరిలో చిన్నికృష్ణుని కోసం సిద్ధం చేసిన ఊయల

విక్రయానికి సిద్ధమైన గణనాథుల విగ్రహాలు



అమ్మకాలకు కొలువుదీర్చిన గణనాథుని విగ్రహాలు

పాలకొండ రూరల్: కొద్ది రోజుల్లో తొలి పూజలు అందుకోనున్న గణనాధుని ఉత్సవాలకు సంబంధించి విగ్రహాలు సిద్ధమయ్యాయి. పాలకొండ - శ్రీకాకుళం, వీరఘట్టం, విశాఖ ప్రధాన రహదారిలో విక్రయదారులు భారీ నుండి చిన్న విగ్రహాలను అమ్మకాలకు సిద్ధం చేశారు. విగ్రహాలను ప్రత్యేక షెడ్‌ల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచారు. విగ్రహాలను ముందస్తుగా కొనుగోలు చేసుకునేందుకు ఉత్సవ నిర్వాహకులు ఉత్సుకత చూపుతున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలో పెద్దకాపు వీధి, వినాయక ఆలయ కూడలి, యాలాం కూడలి, పెద్దగొల్లవీధి వద్ద యువత మండపాలను కొలువుదీర్చి గణేష్ నవరాత్రులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.